www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023

5

పశ్చిమ గోదావరి



## మాంటిస్సోరీలో కవల పిల్లల దినోత్సవం


ప్రజాశక్తి- తణుకు

స్థానిక మాంటిస్సోరీ స్కూల్లో బుధవారం కవల పిల్లల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ ఫిబ్రవరి 22వ తేదీన తమ స్కూల్లో కవల పిల్లల దినోత్సవం ఎంతో వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు.





నామినేషన్ వేస్తున్న ఎంఎల్‌సి అభ్యర్థి కవురు శ్రీనివాస్



నామినేషన్ వేస్తున్న ఎంఎల్‌సి అభ్యర్థి వంకా రవీంద్రనాథ్

స్థానిక సంస్థల ఎంఎల్‌సికి

# నాలుగు నామినేషన్లు దాఖలు

## వైసిపి తరపున కవురు, వంక - టిడిపి తరఫున వీరవల్లి చంద్రశేఖర్ బరిలోకి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి తరపున జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, తణుకుకు చెందిన వంకా రవీంద్రనాథ్, వంకా రాజకుమారి, టిడిపి తరపున వీరవాసరం మండలానికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్ తమ నామినేషన్లను జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ నామినేషన్ సమయంలో వారి వెంట రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎలు చెరుకువాడ శ్రీరంగనాధరాజు, కొఠారు అబ్బయ్యచౌదరి తదితరులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో డిఆర్‌ఒ, సహాయ రిటర్నింగ్ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి పాల్గొన్నారు.

**పాలకొల్లు:** ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాలకొల్లు నుంచి తన అనుయాయులతో ఊరేగింపుగా ఏలూరు తరలి వెళ్లారు. ఆయన వెంట ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు తదితరులున్నారు.

**తణుకు:** ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి తణుకు పట్టణానికి చెందిన వంక రవీంద్రనాథ్ బుధవారం ఏలూరు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొలుత పట్టణంలో వినాయకుని ఆలయంలో రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.



బడ్జెట్ నమూనా ప్రతులను దహనం చేస్తున్న నేతలు

## కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసన

### నమూనా ప్రతులు దహనం

ప్రజాశక్తి - తణుకురూరల్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగినా పాలక, ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ విమర్శించారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బడ్జెట్‌లో కేటాయింపుల్లో భారీ కోతలు, ప్రజలకు వాతలు పెట్టి, కార్పొరేటర్లకు దోచిపెట్టి, రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నిరసన తెలిపారు. బడ్జెట్ నమూనా ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్ చివరిదని, ఈ బడ్జెట్‌లో ఎపికి న్యాయం చేయలేదని విమర్శించారు. కేంద్రం పెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు, బడా పెట్టుబడీదారులకు అనుకూలమైనది తప్ప, దేశ ప్రజల కష్టాలు తీర్చేది కాదని అన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నా ఎపికి ఎలాంటి హామీలూ అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. జిల్లాలో కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌కు నిధులు నామమాత్రంగానే కేటాయించారన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి పెద్దపీట వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా పిలవడం తప్ప ఎలాంటి నిధులూ కేటాయించలేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధలు తగ్గించడం బాధాకరమన్నారు. నేటికీ రైల్వేజోన్ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలు, ఔషధాలు, ఎరువుల ధరలు తగ్గుతాయని ప్రజలు సహజంగా ఆశించారని, అలాంటిదేమీ జరగకపోవడం అన్యాయమని అన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 24న జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, ఎ.అజయకుమారి, కె.నాగరత్నం, ధనలక్ష్మి, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వలస కార్మికుల ప్రయోజనాలు పరిరక్షించాలి

### జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు కార్మిక శాఖాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కార్మిక శాఖ పరిధిలోని అంశాలపై ఆమె సమీక్షించారు. ఒడిశ్శా, పశ్చిమబెంగాల్, బీహార్ నుండి ఎక్కువ మంది జిల్లాకు వచ్చి చేపల చెరువులు, ఆక్వా తదితర ప్రదేశాల్లో పని చేస్తున్నారన్నారు. ఇటువంటి వారిపై దృష్టి సారించాలని తెలిపారు. కొంతమంది తక్కువ కాలం పని చేసి వెళ్లడం కూడా జరుగుతుందన్నారు. ఆ సమయంలో అనుకోని సంఘటన జరిగినప్పుడు వారికి ప్రయోజనాలు కల్పించడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వలస కార్మికులను తీసుకొచ్చేందుకు ఎంతమంది యజమానులు రిజిస్టర్ అయ్యారు, వారు పని వారిని ఎవరికి పంపుతున్నారు, వారికి కల్పిస్తున్న మౌలిక వసతులపై డేటాను క్రోడీకరించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమం, విద్య, కార్మిక శాఖల ఆధ్వర్యంలో టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. నైపుణ్యం గల భవన నిర్మాణ కార్మికులను గుర్తించి జగనన్న లేఅవుట్లలో పనికి వినియోగించాలన్నారు. ప్రతి మండలానికి సుమారు 25 మందిని గుర్తించి గృహనిర్మాణ శాఖకు జాబితాను అందజేయాలని కలెక్టర్ కార్మిక శాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, కార్మిక శాఖ ఇన్‌ఛార్జి డిప్యూటీ కమిషనర్ కుమారి ఆలోచన, అసిస్టెంట్ కమిషనర్ ఎ.లక్ష్మి, గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చయ్య, సహాయ కార్మిక శాఖాధికారులు పాల్గొన్నారు.



వలస కార్మికుల గురించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

**మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక గుర్తింపు పొందాలి**

పట్టణ సుందరీకరణలో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక గుర్తింపు పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై పట్టణాభివృద్ధి, గ్రీనరీ పనులపై సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్లు వేరేచోటికి బదిలీ అయిన తర్వాత కూడా వారి పేరును ప్రజలు గుర్తించుకునేలా పనులు చేపట్టాలన్నారు. నగర సుందరీకరణలో భాగంగా టౌన్‌ప్లాన్ అప్రూవ్డ్ లేఅవుట్లు, రోడ్లకు ఇరుపక్కలా, నివాస ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటించాలన్నారు. జిల్లాలోని ప్రతి పట్టణంలో వ్యాపార సముదాయాల ముందు ఆయా వ్యాపారుల భాగస్వామ్యంతో పెవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పెవర్‌బ్లాక్ ఏర్పాటు వల్ల నడక మార్గానికి అనుకూలంగా ఉండటం, అందంగా కన్పించడం, దుమ్ము ధూళి లేకుండా ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మార్చి నెలాఖరులోపుగా ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. చనిపోయిన, వలస వెళ్లిన, 60 ఏళ్లు పైబడిన వారి స్థానాల్లో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు నిబంధనల మేరకు టిడ్కో ఇళ్లను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బిఆర్ఎస్.శేషాద్రి, ఎస్.శివరామకృష్ణ, సిహెచ్.త్రినాధరావు, కెటి.సుధాకర్, బి.బాలస్వామి, మెప్మా పీడీ ఇమ్మానుయేలు, జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ, ఎల్‌డిఎం ఎన్‌వివి.రమణ, టిడ్కో డిఇ కె.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

దాళ్వా సాగుకు నీరందక వరినాట్లు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణం సాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెల్టా ప్రాంతంలోని కాళ్ల, వీరవాసరం, పోడూరు, పెనుగొండ మండలాల శివారు ప్రాంతాలకు సాగునీరు అందక వరి చేలు బీటలు తీశాయని, ఈ నేపథ్యంలో రైతులు నానావస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సలహా మండలిలో అధికారులు దాళ్వాసాగుకు అవసరమైన నీరు సరఫరా చేస్తాం, ఒక్క ఎకరం కూడా ఎండనీయబోమని హామీ ఇచ్చి ఇప్పుడు రైతులను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వేలకు వేలు పెట్టుబడులు పెట్టి నాట్లు వేశారని తెలిపారు. ఎండలు ముదిరాయని, వేసవి రాకముందే నీటి ఎద్దడి ప్రారంభమైందని, సాగునీటితోపాటు తాగునీరు కూడా దొరకడం కష్టమౌతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు, సాగునీటి ఎద్దడిని తక్షణం పరిష్కరించాలని బలరాం అధికారులను కోరారు.



చికిత్స పొందుతున్న పవన్

## యువతికి వేధింపులు

### ఇదేంటని ప్రశ్నించిన వారిపై యువకుడి బంధువులు దాడి

ప్రజాశక్తి - తణుకురూరల్

యువతిని వేధిస్తున్నాడని అడిగినందుకు కత్తులు, ఇనుపరాడ్‌లు, గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని మండపాక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండపాకకు చెందిన మానేపల్లి స్వామి పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్వామి కుమార్తెను అదే గ్రామంలో నివాసముంటున్న కంకిపాటి చంద్రశేఖర్ కొంతకాలం నుండి వేధిస్తున్నాడు. అయితే పెద్దల సమక్షంలో చంద్రశేఖర్‌ను యువతి కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ హెచ్చరికతో చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. బుధవారం ఉదయం చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు దారి కాచి యువతి అన్న మానేపల్లి పవన్‌పై గొడ్డలి, కత్తులతో దాడి చేశారు. ఈ దాడిని అడ్డుకునేందుకు పవన్ తండ్రి స్వామి ప్రయత్నం చేయగా చంద్రశేఖర్ తండ్రి సుధాకర్, అన్న జయకర్, మరో ముగ్గురు వ్యక్తులు వారిపై కత్తులతో, గొడ్డలి, ఇనుపరాడ్‌లు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన స్వామి పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవన్ తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తణుకు రూరల్ ఎస్ఐ గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఢిల్లీ బయలుదేరి వెళ్తున్న యుటిఎఫ్ నేతలు

## చలో ఢిల్లీకి తరలిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి యుటిఎఫ్ నేతృత్వాన పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు బుధవారం తరలివెళ్లినట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి చెప్పారు. స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ నుంచి యుటిఎఫ్ జిల్లా నేతలు బయల్దేరారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు విస్తరింప జేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. రూ.7.50 లక్షలు ఆదాయం వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని, రూ.2.50 లక్షలు వరకు స్టాండర్డ్ డిటెక్షన్ ఉండాలని, 80 సీసీ మినహాయింపు రూ.మూడు లక్షల వరకు ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఇతర జిల్లా నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటరమణ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బుధవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు పాఠశాలకు వచ్చి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎంఇఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారన్నారు. ఉదయం 7.30 నుండి సాయంత్రం 7.30 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నారని, వారికి చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారన్నారు. ఈ అంశాలను జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న విద్యార్థులు





మాట్లాడుతున్న ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి ఎటివి రవికుమార్

## డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి

### ఎస్ఇబి ఎస్‌పి రవికుమార్

ప్రజాశక్తి - భీమవరంరూరల్

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు యువత స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోకు (ఎస్ఇబి)కి సహకరించాలని ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్ తెలిపారు. బుధవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నాయన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కూడా తమ దష్టికి వచ్చిన సమాచారాన్ని రహస్యంగా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని నివారిస్తామన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు డ్రగ్ మాఫియా ప్రమాదకరంగా మారిందన్నారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.భార్గవ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే అటువంటి వ్యక్తులకు హెచ్ఐవి, టిబి తదితర ప్రమాదకర వ్యాధులు దరిచేరుతున్నాయని తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. ఎస్ఇబి సిఐ వివివి వర్మ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తాగడం కూడా నేరమే అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమారి, ప్రొఫెసర్ పద్మారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## శ్రీశ్రీ రచనలు నేటి సమాజానికి మార్గదర్శకం



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న వక్త

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కిరాణా వర్తక సంఘం హాల్లో రెడ్‌బుక్ డే కార్యక్రమం పి.వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న, శివప్రసాద్ మాష్టార్, కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు, ఆలోచనలు, కవిత్వం నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. ఆయన రచనలు సినిమా రంగంలో కూడా ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన కవిత్వం ప్రతి మనిషీ, ప్రతి వస్తువూ, ప్రతి ప్రాంతం, దేశం దాటి విహరించిందన్నారు. దోపిడీ వ్యవస్థను చీల్చి వలసదారులు, రాళ్లు ఎత్తిన కూలీలు, వృద్ధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు ఇలా అన్ని తరగతుల ప్రజలపైనే కాకుండా అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల, కుక్కపిల్ల ఇలా మనిషి జీవితంలో ప్రతి అంశాన్నీ అంకాన్నీ తడిమింది శ్రీశ్రీ రచన అన్నారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, చిటికెన రాము, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, నరమాల కృష్ణ, రౌతు వెంకటనాగేంద్ర, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

**నరసాపురం:** శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించారని డాక్టర్ కడిమిళ్ల రసాద గురు సహస్రావధాని తెలిపారు. మంగళవారం రాత్రి అల్లూరి సాంస్కృతిక కేంద్రం, భగత్ సింగ్ విజ్ఞాన సేవా కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన రెడ్ బుక్ డే సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవధాని మాట్లాడుతూ తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల శ్రమను గురించి ప్రశ్నించిన ధైర్యశాలి శ్రీశ్రీ అన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, భగత్ సింగ్ విజ్ఞాన సేవా కేంద్రం ఇన్‌ఛార్జి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ప్రపంచాన్ని అనేక మంది తత్వవేత్తలు నిర్వచించారు గానీ మార్క్స్ మాత్రమే దానిని మార్పు కోసం గతితార్కిక ఆలోచనను సూత్రీకరించారన్నారు. మీరా గ్రంథాలయం ఇన్‌ఛార్జి కవురు పెద్దరాజు మాట్లాడుతూ తెలుగు సాహితీవనంలో శ్రీశ్రీ విప్లవ శంఖం పూరించారన్నారు. రచయిత ఎంఎస్ శిరిగినీడి భవానీ శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలకంఠం పాల్గొన్నారు.



నరసాపురంలో మాట్లాడుతున్న వక్త

# ఇంటింటికీ పేపర్ వేస్తూ ఎంఎల్ఎ నిమ్మల నిరసన

**ప్రజాశక్తి - పాలకొల్లు**

జిల్లాలో ఎన్టిఆర్ టిడ్కో గృహల పనులు వెంటనే పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం 5 గంటలకు 17వ వార్డులో ఇంటింటికి సైకిల్పై వెళ్లి పేపర్ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో 7,158 ఇళ్ల పాలకొల్లులో మంజూరు చేసి 90 శాతం పూర్తిచేశామని చెప్పారు. మిగిలిన 10 శాతం, 3 నెలల్లో పూర్తి చేయల్సి ఉండగా 4 సంవత్సరాలైనా పూర్తి చేసి ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. పేదగరువులో కట్టాల్సిన ఇళ్లను రద్దు చేయడం, పట్టణంలో లబ్ధిదారులకు 15, 20 కిలోమీటర్ల దూరంలో కాజగావులో పీకలోతు నీళ్లల్లో ఉన్న ముంపు భూమిలో, సెంటు పట్టా ఇచ్చి మోసం చేయడాన్ని నిరసిస్తూ తాడేపల్లి రాజప్రసాదంలో ఉన్న జగన్కు నిద్రలేపడానికి సైకిల్ పై పేపర్లు వేసినట్లు చెప్పారు.


పేపరు వేస్తున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

## సంక్షేమ పథకాల అమలు ఘనత జగన్దే

**ప్రజాశక్తి - ఆచంట**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి అడుగులో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి కాపమేపుగుంట, మానేవారిపాలెం, దొడ్డిపాటిపాలెం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వంలో ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ అమలు చేయడంలో పాటు సామాజిక న్యాయం పాటించి అందరి మన్ననలు ముఖ్యమంత్రి పొందుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలంతా సిఎం జగన్కు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ చిల్లె లావణ్య, వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

## కోడి రామకృష్ణకు నివాళి

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లు పేరు ప్రతిష్టలు జాతీయ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కోడి రామకృష్ణ అని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక మారుతీ థియేటర్లో బుధవారం డైరెక్టర్ కోడి రామకృష్ణ 4వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా కోడి రామకృష్ణ చిత్రపటానికి ఎంఎల్ఎ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దర్శకరత్న దాసరి నారాయణరావు శిష్యుడిగా వంద చిత్రాలకు దర్శకత్వం వహించారన్నారు. కార్యక్రమంలో మేడికొండ శ్రీనివాస్, మానాపురం సత్యనారాయణ, కెవి కృష్ణవర్మ, పెచ్చెట్టి బాబు, జివి, దేవళ్ల బుజ్జి పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్:** చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న దర్శకుడు కోడి రామకృష్ణ అని ఎలెఫెంట్ చైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్కుమార్ అన్నారు. స్థానిక యళ్లవాని గురువు వైజంక్షన్లోని రాజేంద్ర కాంప్లెక్స్లో బుధవారం లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోడి రామకృష్ణ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా షార్ట్ ఫిల్మ్ దర్శకుడు రావి హరీష్ బాబు రామకృష్ణ చిత్రపటానికి దండవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్కుమార్ మాట్లాడుతూ పాలకొల్లులో పుట్టిన కోడి రామకృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో కష్టాన్ని నమ్ముకుని అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాబత్తుల సూర్య కుమార్, పోకల గంగాధర్, భీమాల సతీష్, కడలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విన్నకోట మృతికి ప్రెస్క్లబ్ సంతాపం

**ప్రజాశక్తి - పాలకొల్లు**

సీనియర్ పాత్రికేయులు విన్నకోట వెంకటేశ్వరరావు మృతికి పాలకొల్లు ప్రెస్క్లబ్ సంతాపం తెలిపింది. బుధవారం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాత్రికేయులు, కళాకారులు, కార్మిక నేతగా ఆయన చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. కార్మిక నేతగా ప్రతిష్టాత్మక శ్రమ శక్తి అవార్డు పొందారని ఎపిడబ్ల్యుజె ఉపాధ్యక్షుడు పిటి వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన మృతికి కార్యదర్శి లాజర్, కోశాధికారి తోట రాంబాబు, మండెల అప్పలరాజు, కాగిత సూర్య నారాయణ, మానాపురం సత్యనారాయణ, బుద్ధిగ గోపి, సరగం సత్యనారాయణ, రేలంగి సుధాకర్ సంతాపం వ్యక్తం చేశారు.

## ఉగాదిలోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

పంచాయతీ కార్యదర్శులు ఉగాదిలోపు లబ్ధిదారులతో గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి అన్నారు. స్థానిక కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి పాలన, జగనన్న గృహ నిర్మాణాలు, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఎఎన్ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆప్షన్ 3 అనుకున్న గృహ నిర్మాణాలను ఉగాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ పూర్ణబాబ్జి

## పాలమూరులో అన్నదానం

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

పొలమూరు మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో యాత్రికులకు అన్న సమారాధన కార్యక్రమం బుధవారం ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తోలేటి సత్యనారాయణ మాట్లాడారు. సుమారు 3,200 మంది ప్రసాదం స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుందర వెంకట నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** మొగల్తూరులోని విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అబుల్ కలాం ఆజాద్కు నివాళి

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లు జివిఎస్విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు చంద్రశేఖర్, బొక్క భవాని దుర్గ పాల్గొన్నారు.

## అయితంపూడిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'


**ప్రజాశక్తి - తణుకు**

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని తణుకు మండలం అయితంపూడిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల కాలంలో ఏమాత్రం అభివృద్ధి పనులు జరగలేదన్నారు. సిఎం జగన్మోహన్రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు జరగలేదన్నారు. పెట్టుబడి లేక ఎంతోమంది యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోశెట్టి రాంబాబు, గ్రామ అధ్యక్షులు గుండేపల్లి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి పోతిరెడ్డి శ్రీనివాసరావు, పోతిరెడ్డి సత్యనారాయణ, నూతంగి సువర్ణ రాజు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ రాధాకృష్ణ



## అభివృద్ధికి సర్రాజు కృషి : ఎంఎల్ఎ



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు

**ప్రజాశక్తి - కాళ్ల**

మంచి నాయకుడు, మార్గదర్శకుడు పాతపాటి సర్రాజు అని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. భీమవరంలో పాతపాటి సర్రాజు నివాసం వద్ద ఎంఎల్ఎ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ 2004లో వైఎస్ఆర్ హయాంలో ఉండి నియోజకవర్గంలో రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని, ఇప్పటివరకు అటువంటి అభివద్ధి ఏ పార్టీలో ఏ నాయకుడూ చేయలేదని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంఎల్సి చైతన్య రాజు, భీమవరం క్షత్రియ సేవాసమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, సభ్యులు రామకృష్ణంరాజు, క్రిస్టియన్ యూత్ క్లబ్ ఆఫ్ ఇండియా చైర్మన్ బంటుమిల్లి సురేష్కుమార్ పాల్గొన్నారు.

**కాళ్ల :** పాతపాటి సర్రాజు ప్రజలు, రైతుల కోసం పాటుపడ్డారని మాజీ ఎంఎల్ఎ పసల కనక సుందరం అన్నారు. భీమవరం ఆదర్శనగర్లో సర్రాజు కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పాతపాటి వాసు, పాతపాటి వర్మ, మంతెన వెంకట రవివర్మ, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు మృతి పేదలకు తీరని లోటని ఎంఆర్పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తెన్నేటి కిషోర్ మాదిగ అన్నారు. భీమవరం ఆయన నివాసంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తెన్నేటి కిషోర్ మాదిగ, నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇన్ఛార్జి ముసుకూడి రాము మాదిగ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ మాదిగ మాట్లాడుతూ సర్రాజు ఎంతో మంచి మనిషని తెలిపారు. ఆయన చేసిన ప్రజా సేవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా అధ్యక్షులు తెన్నేటి సురేష్ మాదిగ, ఎంఆర్పిఎస్ నాయకులు బైపే విజయరాజు, ముసుకూడి సంసోను పాల్గొన్నారు.


సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్ఎ కనక సుందరం

## 24న టిడిపి జోన్-2 సమీక్షా సమావేశం

**ప్రజాశక్తి - భీమవరం**

టిడిపి అధినేత నారా చంద్రబాబు ఈ నెల 24న ఏలూరు దగ్గర చోదిమెళ్ల వద్ద నిర్వహించనున్న టిడిపి జోన్-2 సమీక్షా సమావేశానికి నియోజకవర్గంలోని టిడిపి క్లస్టర్ ఇన్ఛార్జులు, యూనిట్ ఇన్ఛార్జులు తప్పనిసరిగా హాజరు కావాలని భీమవరం నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్ వేండ్ర శ్రీనివాస్ కోరారు. టిడిపి పట్టణ కార్యాలయంలో క్లస్టర్ ఇన్ఛార్జుల బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి చేసిన వైసిపి గూండాలపై కేసులు నమోదు చేయకుండా టిడిపి నాయకులు పట్టాభిపై హత్యా నేరం కేసు నమోదు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నియోజకవర్గ పరిశీలకులు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి జోన్-2 ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల చంద్రబాబు సమీక్షా సమావేశంలో రాష్ట్ర పార్టీ రూపొందించిన ప్రతినిధుల జాబితా ప్రకారమే సమీక్ష నిర్వహిస్తారని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ యూనిట్ ఇన్ఛార్జులు తప్పనిసరిగా ఈ సమీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేపు వెంకన్న, కౌరు పృథ్వీ శంకర్, వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎంపిపి చంటిరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎల్సి అభ్యర్థి కవురు శ్రీనివాస్, వైసిపి నేతలు

## ఘనంగా ఎంపిపి చంటిరాజు పుట్టినరోజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎంపిపి చంటిరాజు స్వగ్రామమైన వేండ్రలో ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్, ఎంఎల్సి అభ్యర్థి కవురు శ్రీనివాస్, నేతలు, అధికారులు ఎంపిపి చంటిరాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి, ఉప ఎంపిపిలు చోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ స్వర్ణలత, శృంగవృక్షం సర్పంచి జంగం సూరిబాబు, ఎంపిటిసిలు పాల జ్యోతి, నాగలక్ష్మి, నాయకులు చెల్లబోయిన పాపారావు, చింతపల్లి చిన్న, రమణ, వేణు, సాల్మోను, పాప సాహెబ్ పాల్గొన్నారు.




వైద్య శిబిరం నిర్వహిస్తున్న సభ్యులు

## మాంటిస్సోరీలో కేన్సర్ నిర్ధారణ శిబిరం

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

మహిళలు తరచుగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని మాజీ ఎంఎల్ఎ బాబ్జి కోరారు. ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో మహిళలకు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. శిబిరాన్ని వసుధ ఫౌండేషన్, పాలకొల్లు లయన్స్ వనిత క్లబ్, మాంటిస్సోరీ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రి, కేన్సర్ ఫౌండేషన్ మొబైల్ యూనిట్తో వచ్చి బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార కేన్సర్కు సంబంధించి పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ శిబిరంలో మామోగ్రఫీ, పాప్ స్మియర్, ఇసిజి ర్యాండమ్ బ్లడ్ షుగర్, బిపి, జనరల్ పరీక్షలు ఉచితంగా చేశారు. ఇంకా కరస్పాండెంట్ మద్దాల వాసు, రావాడ సతీష్, ప్రిన్సిపల్ వసంత లక్ష్మి, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, లయన్స్ రూరల్ క్లబ్ అధ్యక్షులు గూడూరి హనుమంతరావు, కారుమూరి రామలింగేశ్వరరావు, నందుల సీతారామయ్య, రమణి, కేన్సర్ వైద్యులు శిబిరంలో సేవలందించారు. శిబిరం నిర్వహణకు కృషి చేసిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజును మహిళలు అభినందించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న బొమ్మిడి నాయకర్


బీచ్ వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న సంసిద్ పాఠశాల సిబ్బంది

## పేరుపాలెంబీచ్లో వ్యర్థాల తొలగింపు

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మండలంలోని పేరుపాలెం బీచ్లో ప్లాస్టిక్, వ్యర్థాలను నరసాపురానికి చెందిన సంసిద్ పాఠశాల సిబ్బంది బుధవారం తొలగించారు. సంసిద్ విద్యాసంస్థల చైర్మన్ వాసా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా బీచ్ వద్ద సామాజిక కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వలవల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణపై సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షరా ఎలిజిబెత్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్పి శ్రీనాథ్

## అత్యాచారయత్నం కేసుపై విచారణ

**ప్రజాశక్తి - ఆకివీడు**

చిన్నారిపై అత్యాచారయత్నం కేసులో ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి డిఎస్పి శ్రీనాథ్ విచారణ ప్రారంభించారు. బుధవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్పి వివరాలను వెల్లడించారు. గాయపడిన చిన్నారిని సంఘటనా వివరాలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు.

### ఫొక్సో చట్టం అమలు చేయాలి : ఐద్వా

ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి యత్నించిన యువకులను కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్స్టేషన్కు వచ్చిన డిఎస్పి శ్రీనాథ్కు ఐద్వా నాయకులు డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణకు గతంలో ఫొక్సో చట్టం అమల్లో ఉండేదన్నారు. మరోసారి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గంజాయి, మద్యం అశ్లీల వెబ్సైట్లు యువకులను చెడు దిశగా మళ్లిస్తున్నాయని, వాటి నిషేధం కఠినంగా అమలు చేయాలని పోలీసు అధికారులను కోరారు. ఈ చెడు అంశాల కారణంగా యువత చెడు మార్గాల వైపు తేలిగ్గా పయనిస్తున్నారని తెలిపారు. అంతకుముందే తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సిఐ కార్యాలయాల్లోనూ వారు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.పద్మ, జి.లావణ్య, అచ్చయ్యమ్మ, షేక్ పర్వీన్ పాల్గొన్నారు.


డిఎస్పికి వినతి అందించిన ఐద్వా నేతలు

## పాఠశాలకు బీరువాలు అందజేత

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్పి ఉన్నత పాఠశాలకు బుధవారం పూర్వ విద్యార్థులు రెండు బీరువాలు అందజేశారు. 1965-66 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఎల్సి చదువుకున్న పూర్వ విద్యార్థులు, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తండ్రి యువి సూర్యనారాయణ రాజు అభిమానులు ఎం.సత్యనారాయణ, దొంగ కనకేశ్వరరావు పాఠశాల రికార్డులు భద్రపర్చుకునేందుకు వీలుగా బీరువాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బివిఎల్ నరసింహారావు, సంకు నరసింహారావు, బి.పరుశురాముడు, ఎన్విబి.కృష్ణమూర్తి, రాయుడు వెంకటేశ్వరరావు, లక్ష్మణుడు, వేముల సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని జనసేన నర్సాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి బొమ్మిడి నాయకర్ విమర్శించారు. బుధవారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారంలో ప్రతి ఇంటికీ వెళ్లి జనసేన సిద్ధాంతాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపి, దూది బాబు, బొక్క చంటి, నిప్పులేటి రామారావు, ఉప్పులూరు బాలాజీ, నంబుల నాగబాబు పాల్గొన్నారు.


మొహమ్మద్ మొయిజ ఆలం ఫైజీకి నియామక పత్రం అందజేస్తున్న ఎంఎల్ఎ

## సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

### ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని భీమవరం డివిజన్ ఖాజీగా నియమితులైన మొహమ్మద్ మొయిజ ఆలం ఫైజీకి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఫైజీకి నియామక ఉత్తర్వులను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం సున్ని జామియా మస్జిద్ ఫేస్ ఇమామ్ ఫైజీని ఖాజీగా ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ నాయకులు షేక్ రబ్బాని, షేక్ అన్సారీ, షేక్ ఇమామ్ మొహిద్దీన్, ఎండి అస్లాం పాషా పాల్గొన్నారు.